
మైలవరం పంచాయతీ కార్యాలయం సెంటర్లో నిరసన వ్యక్తం చేస్తున్న జోగి రమేష్, నాయకులు


తిరువూరు పట్టణంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తల నిరసన ప్రదర్శన


నూజివీడులో ర్యాలీ చేస్తున్న మేకా ప్రతాప్ అప్పారావు, నాయకులు

మోసపూరిత హామీలతో ప్రజలకు వెన్నుపోటు

- జోగి రమేష్, మేకా ప్రతాప్ అప్పారావు, నల్లగట్ల స్వామిదాసు ధ్వజం
- వెన్నుపోటు కార్యక్రమానికి పోటెత్తిన వైఎస్సార్ సీపీ శ్రేణులు, ప్రజలు
- కూటమి ప్రభుత్వ వైఫల్యాలపై నిరసన

జి.కొండూరు: మోసపూరిత హామీలతో అధికారం చేపట్టిన చంద్రబాబు వాటిని అమలు చేయకుండా ప్రజలకు వెన్నుపోటు పొడిచారని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ మైలవరం నియోజకవర్గ ఇన్‌చార్జి జోగి రమేష్, నూజివీడు మాజీ ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు, వైఎస్సార్ సీపీ తిరువూరు నియోజకవర్గ ఇన్‌చార్జి నల్లగట్ల స్వామి దాసు అన్నారు. వెన్నుపోటు నిరసన కార్యక్రమాలు మైలవరం, నూజివీడు, తిరువూరు నియోజక వర్గాల్లో బుధవారం జరిగాయి. ఆయా కార్యక్రమాల్లో వైఎస్సార్ సీపీ శ్రేణులు, ప్రజలు పెద్దఎత్తున పాల్గొని కూటమి ప్రభుత్వ మోసాలను, వైఫల్యాలను ఎండగట్టారు.

రాష్ట్రంలో రాక్షస పాలన: జోగి రమేష్

మైలవరం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ శ్రేణులతో కలిసి జోగి రమేష్ మైలవరంలో దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అక్కడి నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు పాదయాత్ర నిర్వహించి తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. తహసీల్దార్ అబ్దుల్ దరియాకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జోగి రమేష్ మాట్లాడుతూ గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేసిన పథకాలను రెట్టింపు చేస్తానంటూ ఎన్నికల ముందు నమ్మబలికిన చంద్రబాబు, ముఖ్యమంత్రి కాగానే ప్రజలందరికీ పంగనామాలు పెట్టాడని ఎద్దేవా చేశారు. ముఖ్యంగా తల్లికి వందనం, విద్యా దీవెన, వసతి దీవెన, రైతు భరోసా అమలు చేయకపోవడంతో పాటు ఆరోగ్యశ్రీని అనారోగ్యశ్రీగా మార్చడంతో విద్య, వైద్యం, వ్యవసాయ రంగాలు ఈ ఏడాది కాలంలో కుదేలయ్యాయన్నారు. గత ప్రభుత్వం ప్రతి సంక్షేమ పథకంతో పాటు రేషన్ సరుకులను సైతం ఇంటి వద్దకే అందిస్తే చంద్రబాబు మాత్రం మద్యాన్ని గడపగడపకు అందిస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో విధ్వంసం సృష్టిస్తూ రాక్షస పాలనను కొనసాగిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏడాది కాలంలోనే చంద్రబాబు పాలన నచ్చక ప్రజలంతా రోడ్డెక్కి కదంతొక్కారన్నారు. ఎన్ని అడ్డంకులు సృష్టించినా వేలాది మంది ప్రజలు వెన్నుపోటు దినం కార్యక్రమానికి హాజరై ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకతను చాటిచెప్పారన్నారు.

ఎమ్మెల్యేకి సవాల్ విసిరిన జోగి రమేష్

మైలవరం నియోజకవర్గంలో ఫ్యాను గుర్తుపై గెలిచి వెన్నుపోటు పొడిచిన వసంత వెంకట కృష్ణప్రసాద్‌కి మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గురించి మాట్లాడే స్థాయి లేదని జోగి రమేష్ విమర్శించారు. వసంతకు దమ్ముంటే పార్టీలతో సంబంధం లేకుండా సింగిల్‌గా పోటీచేద్దామని, తనపై పోటీ చేసి గెలవాలని సవాల్ విసిరారు. ఎప్పుడు ఎన్నికలొచ్చినా వసంత వెంకట కృష్ణప్రసాద్‌ని తరిమి కొట్టడానికి నియోజకవర్గ ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. కృష్ణప్రసాద్(కేపీ), పోసాని కోటేశ్వరరావు(పీకే) ఇద్దరూ కలిసి మట్టి, ఇసుక, డబ్బు అనే తేడా లేకుండా నియోజకవర్గాన్ని దోచుకుంటున్నారని మండిపడ్డారు. తన కుమారుడిపై తనపై ఎన్ని కేసులు పెట్టినా తలవంచేది లేదన్నారు. నియోజకవర్గంలో వసంత, రాష్ట్రంలో చంద్రబాబు అక్రమాలను ఎప్పటికప్పుడు ఎండగడతూనే ఉంటామని హెచ్చరించారు.

ప్రజల తరఫున నిరంతర పోరాటం: నల్లగట్ల స్వామిదాసు

తిరువూరు: వెన్నుపోటు దినం సందర్భంగా తిరువూరులో వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో నియోజకవర్గ కార్యాలయం నుంచి ఆర్డీఓ కార్యాలయం వరకు నిరసన ప్రదర్శన నిర్వహించారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని కోరుతూ తిరువూరు ఆర్డీఓ మాధురికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా స్వామిదాసు మాట్లాడుతూ గతంలో కంటే మెరుగైన సంక్షేమ పథకాలు అందిస్తానని, ప్రజల అభ్యున్నతికి భరోసా నాదంటూ ఊకదంపుడు ఉపన్యాసాలిచ్చిన చంద్రబాబు గద్దెనెక్కాక కల్లబొల్లి కబుర్లు చెబుతూ కాలక్షేపం చేస్తున్నారని విమర్శించారు. ప్రజలకు జవాబుదారీగా ఉంటూ అవసరమైతే ఎవరినైనా ప్రశ్నిస్తానని ప్రగల్భాలు పలికిన డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ మౌనవ్రతం దాల్చడాన్ని ప్రజలు గమనిస్తున్నారన్నారు. ప్రజా సమస్యలపై, కూటమి ప్రభుత్వ హామీల అమలు కోసం వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహనరెడ్డి నేతృత్వంలో నిరంతరం పోరాడతామని స్వామిదాసు పేర్కొన్నారు. కార్యక్రమంలో తిరువూరు ఏఎంసీ మాజీ చైర్మన్ మద్దిరెడ్డి సూర్యనారాయణరెడ్డి, నియోజకవర్గ మహిళా విభాగం అధ్యక్షురాలు పి. సుధారాణి, మాజీ జెడ్పీ వైస్‌చైర్‌పర్సన్ నల్లగట్ల సుధారాణి, రాష్ట్ర పార్టీ నాయకుడు నరెడ్ల వీరారెడ్డి, తిరువూరు, ఎ.కొండూరు జెడ్పీటీసీ సభ్యులు యరమల రామచంద్రారెడ్డి, భూక్యా గన్యా, నియోజకవర్గ రైతు, కార్మిక విభాగాల అధ్యక్షులు వంకలపాటి సాంబశివరావు, యరదేశి రామారావు, తిరువూరు నగర పంచాయతీ వార్డు కౌన్సిలర్లు పరసా శ్రీనివాసరావు, మోదుగు ప్రసాద్, తంగిరాల వెంకటరెడ్డి, తిరువూరు పట్టణ, మండల, విస్సన్నపేట పట్టణ, మండల, గంపలగూడెం మండలాల పార్టీ అధ్యక్షులు చలమాల సత్యనారాయణ, తాళ్ళూరి నవీన్, ఓలేటి దుర్గారావు, నెక్కళపు కుటుంబరావు, కావూరి వినయ్‌కుమార్, పార్టీ లీగల్ సెల్ కన్వీనర్ రేగళ్ల మోహన్‌రెడ్డి, నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు దేశిరెడ్డి శ్రీనివాసరెడ్డి, పార్టీ నాయకులు ముంగా జయరాజు, తానంకి రాంబాబు, చావా వెంకటేశ్వరరావు, ఉమామహేశ్వరరావు, నరేష్, జాకీర్, మామిడి కుటుంబరావు, నాగిరెడ్డి, వెలుగోటి ఆదినారాయణ, గద్దల ఏసురత్నం, సీతారామయ్య, కలకొండ రవికుమార్, గుంటూరు మస్తాన్, కోట దాసు, వినాయకరావు, చెరుకు నరసారెడ్డి, బండి రవికుమార్, మామిడి కుటుంబరావు, గొర్ల నర్సిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


మైలవరం లకిరెడ్డి హనిమిరెడ్డి కాంప్లెక్స్ వద్ద నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న జోగి రమేష్, నాయకులు

కూటమి పాలనలో ప్రజలు అష్టకష్టాలు

మేకా ప్రతాప్ అప్పారావు

నూజివీడు: ఏడాది కాలంగా కూటమి ప్రభుత్వం కల్లబొల్లి కబుర్లతో కాలక్షేపం చేస్తోందని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ నూజివీడు నియోజకవర్గ ఇన్‌చార్జి మేకా వెంకట ప్రతాప్ అప్పారావు ధ్వజమెత్తారు. వైఎస్సార్ సీపీ పిలుపు మేరకు బుధవారం వెన్నుపోటు దినం కార్యక్రమం నిర్వహించారు. ద్వారకా సెంటర్ నుంచి శ్రీనివాస సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. శ్రీనివాస సెంటర్‌లో ప్రతాప్ మాట్లాడుతూ సూపర్ సిక్స్‌తో పాటు 143 హామీలను తుంగలో తొక్కిన ఘనుడు చంద్రబాబు అని ఎద్దేవా చేశారు. తల్లికి వందనం అమలు ఎక్కడ, అన్నదాత సుఖీభవ కింద రూ.20 వేలు ఏవీ, నిరుద్యోగులకు నెలకు రూ.3 వేలు ఎక్కడ, ఉచిత బస్సు అమలు ఏదంటూ ప్రభుత్వాన్ని నిలదీశారు. పది నెలల క్రితం పట్టణంలోని పెద్ద చెరువుకు నాలుగు గండ్లు పడితే ఇంత వరకు ఆ గండ్లను పూడ్చలేని అసమర్థ ప్రభుత్వం రాష్ట్రంలో పాలన చేస్తోందని విమర్శించారు. గత ప్రభుత్వంలో నూజివీడులో మైలవరం రోడ్డు నుంచి విస్సన్నపేట రోడ్డుకు బైపాస్ రోడ్డు నిర్మాణానికి రూ.25 కోట్లు మంజూరై భూ సేకరణకు సంబంధించి అవార్డు సైతం పూర్తయిందని, ఈ ప్రభుత్వంలో ఏడాది కాలంలో ఇంతవరకు ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదన్నారు. ఏరియా ఆస్పత్రిలో రూ.25 కోట్లతో నూతన భవనం నిర్మించారని, దీనికి 300 బెడ్లు ఏర్పాటు చేస్తే జిల్లా ఆస్పత్రిగా మార్చడానికి వీలవుతుందని, ఎమ్మార్ అప్పారావు కాలనీలో పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి భవనాన్ని నిర్మించి పది నెలలు అవుతున్నా ఇంతవరకు అందులో అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మార్చడం లేదన్నారు. అనంతరం సబ్ కలెక్టర్ కార్యాలయ ఏఓ ఉదయభాస్కర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ గుడిమళ్ల కృష్ణంరాజు, జెడ్పీటీసీలు వరికూటి ప్రతాప్, పిన్నిబోయిన వీరబాబు, వైఎస్సార్ సీపీ నూజివీడు, ముసునూరు మండలాల అధ్యక్షుడు శీలం రాము, మూల్పూరి నాగ వల్లేశ్వరరావు, మున్సిపల్ వైస్ చైర్మన్ కొమ్ము వెంకటేశ్వరరావు, ఎంపీపీ గోళ్ల అనూష, నాయకులు రామిశెట్టి మురళీకృష్ణ, పుచ్చకాయల సుబ్బారెడ్డి, అత్తి మురళి, షేక్ యూనస్‌పాషా, పిళ్లా చరణ్, పామర్తి రాధాకృష్ణ, కంచర్ల లవకుమార్, బసవా వినయ్, అత్తి పార్వతి, పలగాని నరసింహారావు, పలువురు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

వెన్నుపోటు రాజకీయాలు వారికే తెలుసు



నమ్మిన వారిని నట్టేట ముంచడం, వెన్నుపోటు పొడవడం ప్రస్తుత పాలకులకు వెన్నతో పెట్టిన విద్య. ఇంత నీచ రాజకీయాలు చేస్తూ వైఎస్సార్ సీపీ పాలనపై బురద జల్లడం ఏమిటో అర్థం కావట్లేదు. ప్రజా సంక్షేమాన్ని విస్మరించిన కూటమి ప్రభుత్వంపై ప్రజలు తిరుగుబాటు చేయడం తథ్యం.

– ఏరువ ప్రకాష్‌రెడ్డి, తిరువూరు నగర పంచాయతీ కో–ఆప్షన్ సభ్యుడు

పని కావాలంటే కాళ్లరిగేలా తిరగాల్సిందే



ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఒక్క పథకం అమలు కావట్లేదు. రైతు భరోసా అమలు చేయకుండా రైతులకు చుక్కలు చూపిస్తున్నారు. గత ప్రభుత్వంలో అధికారులే ఇంటికి వచ్చి అన్ని పనులు చేసిపెట్టారు. ఇప్పుడు ఏ పని కావాలన్నా ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తుంది. విత్తనాల పంపిణీ కూడా లేదు. రైతు భరోసా కేంద్రాలలో ఎరువులు, పురుగు మందుల సరఫరాను ఆపేశారు.

– పిచ్చయ్య, రైతు, ఎదురుబీడెం, మైలవరం మండలం

ప్రజా సంక్షేమాన్ని గాలికొదిలేశారు



కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని గాలికొదిలేసింది. ఆర్థిక పరిస్థితుల మీద అవగాహన ఉందని చెప్పిన చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తర్వాత సూపర్ సిక్స్ అమలుకు డబ్బులు లేవని చెప్పడం చూసి ప్రతి ఒక్కరూ నవ్వుకుంటున్నారు. పథకాల గురించి ప్రజలు ఎక్కడ తిరగబడతారోనని ప్రతిపక్ష పార్టీ నాయకులపై అక్రమ కేసులు బనాయించి ప్రశ్నిస్తే ప్రజలకు కూడా ఇదే గతి పడుతుందని పరోక్షంగా భయపెడుతున్నారు.

– పచ్చిగోళ్ల వెంకటరత్నరాజు, వైఎస్సార్ సీపీ ఎన్టీఆర్ జిల్లా ఐటీ వింగ్ అధ్యక్షుడు

హామీలను తుంగలో తొక్కారు



కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను తుంగలో తొక్కింది. అందరికీ అన్ని పథకాలూ ఇస్తామని ఊరించి ఓట్లేయించుకున్న నేతలు గెలిచిన తర్వాత ముఖం చాటేస్తున్నారు. అసలైన వెన్నుపోటుదారు కూటమి ప్రభుత్వమే.

– వంకలపాటి సాంబశివరావు, వైఎస్సార్ సీపీ రైతు విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు

నమ్మి ఓట్లేస్తే నట్టేట ముంచారు



దేశంలో ఎక్కడా లేనన్ని పథకాలను అమలు చేస్తామని హామీలిచ్చిన కూటమి నాయకులు ఓట్లు వేసిన ప్రజలను నట్టేట ముంచారు. వైఎస్సార్ సీపీ పాలనలో అందరికీ అన్ని సంక్షేమ పథకాలూ అందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుంది.

– మాయిరి వెంకటరమణ, లక్ష్మీపురం

'సూపర్ సిక్స్' ఏమయ్యాయి?



వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కంటే మెరుగైన పాలన అందిస్తామని ఎన్నికల్లో ఊదరగొట్టిన కూటమి నేతలు సూపర్ సిక్స్ పథకాలను ఇంతవరకు అమలు చేయకపోవడం గర్హనీయం. ప్రజలు సంక్షేమ పథకాలు ఇస్తారని నమ్మి ఓటేస్తే వారిని నిలువునా ముంచారు.

– నరేష్, వైఎస్సార్ సీపీ యూత్ నాయకుడు, చౌటపల్లి

చేతకాని ప్రభుత్వం



అధికార దాహంతో అలవికాని హామీలిచ్చి అధికారంలోకి వచ్చాక చతికిలబడిన కూటమి ప్రభుత్వం ప్రజాదరణ కోల్పోయింది. ఇంత చేతకాని ప్రభుత్వాన్ని గతంలో ఎన్నడూ చూడలేదు. ప్రతిపక్ష నేతలపై అక్రమ కేసులు బనాయించడం, సంక్షేమ పథకాలను ప్రజలకు దూరం చేయడంలో ఈ ప్రభుత్వం నూటికి నూరు మార్కులు సాధించింది.

– కోట దాసు, మాజీ ఎంపీపీ, గంపలగూడెం


మైలవరం తహసీల్దార్ అబ్దుల్ దరియాకు వినతిపత్రం అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు


మైలవరంలో కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ప్లకార్డులు ప్రదర్శిస్తున్న యువత


తిరువూరులో నిరసన కార్యక్రమంలో మాట్లాడుతున్న స్వామిదాసు


నూజివీడు సబ్ కలెక్టర్ కార్యాలయ ఏఓ ఉదయభాస్కర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ప్రతాప్ అప్పారావు, నాయకులు

క్లుప్తంగా

ప్రమాద బాధితులకు జోగి రమేష్ పరామర్శ



మైలవరం: ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన కీర్తిరాయునిగూడెంకు చెందిన ఒడుగు నరేంద్ర, మట్టా నాగసాయిలను మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ మైలవరం నియోజకవర్గ ఇన్‌చార్జి జోగి రమేష్ బుధవారం వారి ఇళ్లకు వెళ్లి పరామర్శించారు. ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి



చాట్రాయి: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని ఎంఈఓ బ్రహ్మాచారి అన్నారు. బుధవారం చాట్రాయి జెడ్పీ హైస్కూల్‌లో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం కింద వంట ఏజెన్సీలకు నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో ఆయన పాల్గొని పలు సూచనలు చేశారు. ప్రధానోపాధ్యాయుడు డి.కృష్ణ, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

జేవీవీ వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): శాస్త్రీయ సమాజ నిర్మాణం కోసం జన విజ్ఞాన వేదికలో సభ్యులుగా చేరాలని జన విజ్ఞాన వేదిక కమిటీ సభ్యులు కోరారు. స్థానిక మోహనరావు మెమోరియల్ వైద్యశాలలో జేవీవీ సభ్యత్వ నమోదు వాల్‌పోస్టర్లను బుధవారం ఆవిష్కరించారు. జేవీవీ జిల్లా అధ్యక్షుడు వెనిగళ్ల మురళీ మోహన్ మాట్లాడుతూ ప్రజల్లో శాస్త్రీయ విజ్ఞానం ప్రచారం చేయడం, శాస్త్రీయ దృక్పథం పెంపొందించడం ద్వారా మూఢ విశ్వాసాలను అరికట్టవచ్చన్నారు. డాక్టర్ మామిడి సీతారామారావు, జేవీవీ జిల్లా ఉపాధ్యక్షుడు కామేశ్వరరావు, నాగరాజు, చేతన్ మురళి, ప్రసాద్, యల్లమందయ్య పాల్గొన్నారు.

కృష్ణుని విగ్రహాలకు అభిషేకాలు

ముసునూరు: చెక్కపల్లి శ్రీకృష్ణ ఆలయ ప్రాంగణంలో బుధవారం స్వామి వార్ల విగ్రహాలకు అభిషేకాలు, గ్రామోత్సవం నిర్వహించారు. గురువారం నిర్వహించనున్న స్వామి వారి విగ్రహం, ధ్వజ స్తంభ ప్రతిష్ఠను పురస్కరించుకుని ఆలయ ప్రాంగణంలో గ్రామానికి చెందిన పలువురు దంపతులు నిత్య హోమాదులు, విశేష పూజలు నిర్వహించారు.

8న చేప మందు పంపిణీ

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): మృగశిర కార్తె ప్రవేశం సందర్భంగా ఆస్తమా, ఉబ్బసం వ్యాధిగ్రస్తులకు ఈనెల 8న ఉచిత చేప మందు పంపిణీ కార్యక్రమం కొండపల్లిలో జరుగుతుందని నిర్వాహకులు మహ్మద్ మసూద్ అలీ జిన్నా, మహ్మద్ మహమూద్ అలీ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆస్తమా వ్యాధిగ్రస్తులకు చేపమందు ఉపశమనం కలిగిస్తుందన్నారు. ఉబ్బసం వ్యాధిగ్రస్తులు మూడేళ్ల పాటు తీసుకోవాల్సి ఉంటుందని చెప్పారు. కొండపల్లిలోని ఆరు పంపుల సెంటర్ వద్ద తమ స్వగృహంలో 8న ఉదయం నుంచి సాయంత్రం వరకు చేపమందు పంపిణీ చేస్తామని చెప్పారు.

బీసీలకు అదనంగా రూ.20 వేలు రాయితీ

జి.కొండూరు: సూర్య ఘర్–ముఫ్త్ బిజిలీ యోజనలో భాగంగా బీసీలకు అదనంగా రూ.20 వేలు రాయితీని అందిస్తున్నామని విద్యుత్ శాఖ ఏడీఈ ఐ.సుధాకర్ తెలిపారు. జి.కొండూరు విద్యుత్ సబ్‌స్టేషన్‌ను బుధవారం సందర్శించిన ఆయన స్థానిక ఏఈ షఫీతో కలిసి విలేకరులతో మాట్లాడారు. ఈ పథకం ద్వారా బీసీలకు మరింత లబ్ధి చేకూరేలా అదనంగా రూ. 20 వేలు రాయితీతో కలిపి రూ.98 వేలు రాయితీగా ఇస్తున్నామని వివరించారు.

ఆర్కిడ్ ఇంటర్నేషనల్ స్కూల్ ప్రారంభం



నూజివీడు: పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఆర్కిడ్ ఇంటర్నేషనల్ స్కూల్‌ను తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్, కృష్ణా యూనివర్సిటీ డైరెక్టర్ ప్రొఫెసర్ మండవ వెంకట బసవేశ్వరరావు బుధవారం ప్రారంభించారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ ఇంటర్నేషనల్ స్కూల్‌ను గ్రామీణ ప్రాంతాలకు కూడా చేరువ చేయడం అభినందనీయమన్నారు. విద్యతోనే సమాజాభివృద్ధి జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఆర్కిడ్ ఇంటర్నేషనల్ స్కూల్ చైర్మన్ మేడా మోహన్‌రావు, డైరెక్టర్లు గొల్లపూడి రవిబాబు, మేడా శ్రీహర్ష, దీప్తి, పాఠశాల ప్రిన్సిపాల్ ఎంపీ రుక్మిణి, పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

రేషన్ డీలరుపై కేసు నమోదు

తిరువూరు: రెడ్డిగూడెం మండలం నాగులూరులో రేషన్ పంపిణీలో అవకతవకలకు పాల్పడుతున్న డీలర్ నందిపాము వరప్రసాద్‌పై తిరువూరు ఆర్డీఓ కె. మాధురి బుధవారం 6–ఏ కేసు నమోదు చేశారు. చౌకధరల దుకాణాన్ని ఆర్డీఓ ఆకస్మికంగా తనిఖీ చేయగా స్టాకు రిజిస్టరు కంటే అదనంగా 162 కిలోల బియ్యం, 72 కిలోల పంచదార డీలరు వద్ద ఉన్నట్లు గుర్తించారు. కార్డుదారుల నుంచి రేషన్ సరుకులను డీలరు కొనుగోలు చేస్తున్నట్లు భావిస్తున్నారు.

రేషన్ షాప్ సీజ్

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం ఆరో నంబర్ రేషన్ షాపు నుంచి పేదలకు చెందాల్సిన బియ్యాన్ని వేలి ముద్రలు వేయించుకుని నగదు పంపిణీ చేశారు. పక్క గదిలో బియ్యం నిల్వ చేసిన విషయాన్ని తెలుసుకున్న పౌరసరఫరాల డెప్యూటీ తహసీల్దార్ రామకృష్ణ బుధవారం దుకాణంపై దాడిచేసి 600 కిలోల బియ్యం మిగులు ఉన్నట్లు గుర్తించారు. దుకాణం సీజ్ చేసి షోకాజ్ నోటీసు జారీ చేశారు.


డీలర్ వరప్రసాద్‌ను విచారణ చేస్తున్న ఆర్డీఓ మాధురి

విద్యార్థులకు నగదు బహుమతులు అందజేత

ఆగిరిపల్లి: విద్య ద్వారానే సమాజ అభివృద్ధి సాధ్యమని ఎంఈఓ సర్వేశ్వరరావు అన్నారు. సగ్గూరులో ఉపాధ్యాయులు ప్రభాకర్‌రావు, గంగమ్మ పదో తరగతి, ఇంటర్మీడియెట్‌లో అత్యధిక మార్కులు సాధించిన 12 మంది విద్యార్థులకు నగదు బహుమతులను అందజేశారు. ఎంఈఓ–2 కొవ్వలి ఆనంద్ కుమార్, ప్రధానోపాధ్యాయిని భవాని తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గంగానమ్మ ఆలయం వార్షికోత్సవం

రాయనపాడు(విజయవాడరూరల్): రాయనపాడు గ్రామంలోని గంగానమ్మ అమ్మవారి దేవాలయ వార్షికోత్సవం బుధవారం జరిగింది. స్థానిక ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు పోలసాని వాసు, పాపారావు, గ్రామస్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

భగవద్గీత శ్లోకాల పఠనం

మైలవరం: మైలవరం శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణా శిబిరంలో బుధవారం విద్యార్థులతో భగవద్గీత శ్లోకాలు పఠనం చేయించారు. అనంతరం జెడ్పీహెచ్ బాలికల హైస్కూల్ ఉపాధ్యాయులు కె. గోపాలం తెలుగు బోధనా పద్ధతులు, తెలుగు సామెతలను వివరించి విద్యార్థులతో చెప్పించారు. విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు.

కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని వినతి

విస్సన్నపేట: కౌలు రైతులకు భూ యజమానితో సంబంధం లేకుండా కౌలు రైతు కార్డులు గ్రామ సభల ద్వారా ఇవ్వాలని కౌలు రైతుల సంఘం మండల అధ్యక్షుడు పులిబండ ఏడుకొండలు విజ్ఞప్తి చేశారు. ఖరీఫ్ సీజను ప్రారంభమవుతున్నందున కౌలు రైతులకు పంటల బీమా సౌకర్యం కల్పించాలని తదితర డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం డీటీ సీహెచ్ హేమప్రసాద్‌కు అందజేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు వి. నాగరాజు, రైతు సంఘం మండల అధ్యక్షుడు జి. రామకృష్ణ, కేవీపీఎస్ జిల్లా నాయకుడు మేకల జ్ఞానరత్నం పాల్గొన్నారు.

అగ్రిగోల్డ్ బాధితులకు అసోసియేషన్ అండ

నూజివీడు: అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం జరిగే వరకు అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అండగా ఉంటుందని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి, అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు ముప్పాళ్ల నాగేశ్వరరావు అన్నారు. పట్టణంలోని అమర్‌భవన్‌లో బుధవారం అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వీవీ సూర్యనారాయణ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అగ్రిగోల్డ్ సమస్య మొదలై పదేళ్లయినా ఇంకా బాధితులకు పూర్తి న్యాయం జరగలేదన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు తమ మేనిఫెస్టోలో అగ్రిగోల్డ్ ఆస్తులు అమ్మి బాధితులకు డబ్బులు చెల్లిస్తామని హామీ ఇచ్చిందన్నారు. ఈ ప్రభుత్వం వచ్చి ఏడాది కావస్తున్నా అగ్రిగోల్డ్ ఆస్తులకు వేలం నిర్వహించకపోవడంతో అగ్రిగోల్డ్ బాధితులు ఆందోళన చెందుతున్నారన్నారు. ప్రభుత్వం సత్వరమే అగ్రిగోల్డ్ బాధితులకు డబ్బులు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు చలసాని వెంకట రామారావు, అగ్రిగోల్డ్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిరుపతిరావు, కృష్ణా జిల్లా అధ్యక్షుడు కె. గగన్, సీపీఐ పట్టణ కార్యదర్శి చాట్ల పుల్లారావు తదితరులు పాల్గొన్నారు.

యోగాతో మానసిక ప్రశాంతత

చాట్రాయి: యోగాతో మానసిక ప్రశాంతత కలుగుతుందని ఎస్ఐ రామకృష్ణ అన్నారు. బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో సిబ్బంది యోగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ యోగాతో చాలా ప్రయోజనాలు ఉన్నాయని వివరించారు.

ఉపాధ్యాయులకు యోగా శిక్షణ

జి.కొండూరు: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని జి.కొండూరు మండల ప్రజా పరిషత్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు స్థానిక కమ్యూనిటీహాలులో యోగా శిక్షణా తరగతులు బుధవారం నిర్వహించారు. ఎంపీడీఓ రామకృష్ణ నాయక్ మాట్లాడుతూ మండల పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల నుంచి ఒక్కొక్క పాఠశాలకు ఇద్దరు పాధ్యాయుల చొప్పున ఈ శిక్షణా తరగతులకు హాజరయ్యారని చెప్పారు. తహసీల్దార్ చాట్ల వెంకటేశ్వర్లు, అధికారులు పాల్గొన్నారు.

ఆగిరిపల్లి: సంపూర్ణ ఆరోగ్యం ఉండాలంటే ప్రతిరోజు యోగా సాధన చేయాలని ఎంపీడీఓ భార్గవి అన్నారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మండల స్థాయిలో విద్యార్థులకు యోగా, వ్యాస రచన, చిత్రలేఖనంపై పోటీలు నిర్వహించారు. విజేతలకు ఎంపీడీఓ భార్గవి బహుమతులు అందజేశారు. హోమియో వైద్యురాలు రజిత, యోగా శిక్షకులు యండూరు నరసింహమూర్తి, సాంబశివరావు, జ్యోతి కుమారి పాల్గొన్నారు.